క్లుప్తంగా

యువతకు వాలీబాల్ పోటీలు



పోటీలకు హాజరైన క్రీడాకారులతో పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జాగృతి యువత కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎచ్చెర్ల ఆర్మడు రిజర్వు కార్వర్టర్స్ క్రీడా మైదానంలో యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఐదు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఎస్సై వి.సత్యనారాయణ పోటీలు ప్రారంభించారు. యువత క్రీడలకు, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చెడు వ్యసనాలకు, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. జాగృతి యువత కోసంలో భాగంగా యువతను భాగస్వామ్యం చేస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సక్రమంగా సచివాలయ సేవలు



రికార్డులు పరిశీలిస్తున్న వాసుదేవరావు

లావేరు: సచివాలయాల్లో సేవలు మరింత సంతృప్తికరంగా అందించాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ జిల్లా నోడల్ అధికారి పి.వాసుదేవరావు అన్నారు. తాళ్లవలస గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, వలంటీర్ల హాజరుతో పాటు సచివాలయంలో గల అన్ని రికార్డులను పరిశీలించారు. పౌరసేవమ రిజిష్టరును తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ ఉన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భూసారం పెంపునకు దోహదం చేసే నవధాన్యాలు పంపిణీ కార్యక్రమాన్ని కుశాలపురంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కిట్లు పంపిణీ చేసి వాటి ప్రయోజనాలను సిబ్బంది వివరించారు. ఖరీఫ్‌కు ముందు నవధాన్యలు సాగుచేయాలని, 40 నుంచి 45 రోజుల మధ్య పొలాన్ని దుక్కి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది వెంకటరమణ, రజని, చిన్నారావు, రాణి, అమ్మాజి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



దుర్గారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: పైడిభీమవరం ఎంపీటీసీ సభ్యుడు మునకాల దుర్గారావు తండ్రికి ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స అయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వరిసాం గ్రామానికి శుక్రవారం వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పైడిభీమవరం మాజీ సర్పంచ్ లంకలపల్లి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, మహంతి చినరామినాయుడు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల పాల్గొన్న విద్యార్థులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో జాగృతి-యుతవ కోసం కార్యక్రమంలో భాగంగా ఆ బృందానికి శుక్రవారం రాత్రి వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్ఐ కె.లక్ష్మీ పేర్కొన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన 20 మంది విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అరసవల్లి: జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న పెద్దపాడు ఫీడర్ మరమ్మతులను శనివారం చేపట్టనున్నారు. ఈ మేరకు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దపాడు, తంగివానిపేట, చాపురం, పాత్రునివలస తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా



రణస్థలం: ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రణస్థలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడుతున్నవి ఇళ్లు కాదని.. ఏకంగా ఊర్లే నిర్మిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. వాటిని చూసి ఓర్వలేక మతిభ్రమించి చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. అమరావతి ఇళ్ల స్థలాల పంపిణీపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రణస్థలంలోని రామతీర్థాలు కూడలిలో జాతీయ రహదారిపై శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్న గొప్ప వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. 21 లేఅవుట్లలో 50 వేల మందికిపైగా పేదలకు పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని అపేందుకు ఎన్ని కుట్రలు పన్నినా పేదల ఆకాంక్ష, సీఎం జగనన్న సంకల్పం ముందు నిలువలేకపోయావన్నారు. క్షుద్ర రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు, దత్తపుత్రుడుకు ప్రజలు 2024లో మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, బవిరి రమణ, కంబపు రామిరెడ్డి, బొమ్మలాట శ్రీరాములు, రణస్థలం ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు కిల్లారి రమణ, పిన్నింటి లక్ష్మంనాయుడు, రెడ్డి వాసు, కిల్లారి సూర్యనారాయణ, పాశపు ముకుంధరావు, మహంతి జోగినాయుడు, టేకి బ్రహ్మజీ, మహంతి సత్యనారయణ, పాల రాము, చుక్క రమణ, పిన్నింటి గౌరి నాయుడు, కెల్ల రమణ, కరిమజ్జి రమణ, చందక రమణ పాల్గొన్నారు.

జి.సిగడాం: పేదలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలను చంద్రబాబు సమాధిలతో పోల్చడం తగదని పార్టీ నాయకులు అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ నాయకుడు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డొల వెంకటరమణ,మండలవ్యవసాయశాఖ సలహా మండలి ఛైర్మన్ మక్క వెంకటిసాయి, వైస్ ఎంపీపీలు మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, పీఏసీఎస్ ఛైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, సర్పంచులు ముద్దాడ గౌరీ, బూడారి లక్ష్మణరావు, భూపతి సురేష్‌కుమార్, చిత్తిరి మోహన్, వడిశ మహేశ్వరావు, నాయిన సింహాచలం, బాలి అప్పల సూరి, వెలిది సాయిరాం, పున్నాన అక్కలనాయుడు, ఇజ్జి గోవిందరావు, టంకాల సత్యన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు పెద్ది శ్రీనివాసరావు, బూటు అప్పారావు ఇల్లాక రాములు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను సమాధులు అనడం సరికాదు



ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి

శ్రీకాకుళం అర్బన్: పేద వాళ్లకు ప్రభుత్వం ఇచ్చే భూమిని సమాధులతో పోల్చిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు తీరు సరికాదని ఏపీ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ ఇంచార్జి బెందాళం పద్మావతి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పేద, బడుగు బలహీన వర్గాల అంభ్యున్నతి కోసం ఒక మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలో నిరుపేద కుటుంబం ఉండకూడదని నిర్ణయించుకుని ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షలకు పైగా ఇళ్లు ప్రభుత్వం ఇస్తోందన్నారు. ఇదిచూసి ఓర్వలేని చంద్రబాబుకు కన్ను కుట్టిందన్నారు. రాష్ట్రంలో ఉన్న బలహీన వర్గాలు ఎప్పుడూ బానిసలుగా మాత్రమే ఉండాలనే దురుద్దేశం కలిగిన చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు కేటాయిస్తే చంద్రబాబుకు ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. 2014 నుండి 2019 వరకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలలో అర్హులైన పేదలు ఎంత మందికి ఇళ్లు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. పేదల పట్ల బాబు ఆలోచన ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబు పేదలకు వ్యతిరేకి అని పెందుర్తి సభలో ఆయన మాటలతో నిరూపించుకున్నారని అన్నారు.

చంద్రబాబుకు అహంకారం

లావేరు: పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలను సమాధులతో పోల్చడం చంద్రబాబు అహంకారానికి నిదర్శనమని లావేరు జెడ్పీటీసీ సభ్యుడ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాల క్రిష్ణ అన్నారు. చంద్రబాబు అనుచిత వాఖ్యలకు నిరసనగా సుభద్రాపురం గ్రామం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్నా, మానవహారం కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పేదలకు స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్లను నిర్మిస్తుంటే చంద్రబాబు సమాధులతో పోల్చడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో పేదలకు సెంటు స్థలం కూడా ఇవ్వలేకపోయారన్నారు. చంద్రబాబును ప్రజలు ఘోరంగా ఓడించానా ఇంకా బుద్ధి రాలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు షేక్‌చాన్‌బాషా, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: నిరసన ర్యాలీలో నాయకులు



లావేరు: సుభద్రాపురం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును శుక్రవారం పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. గత కొన్నేళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వెంటనే రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలని, ప్రతీ నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని, 11వ పీఆర్సీ కమిషన్ రికమెండ్ చేసిన పే స్కేల్‌ను వెంటనే విడుదల చేయాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఛైర్మన్ కె.శ్రీరాములు, అసోసియేట్ ఛైర్మన్ పి.లక్ష్మణరావు, ఏపీ సర్వీసులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దిలీప్ చక్రవర్తి, కార్యదర్శి బి.వి.వి.ఎస్ రాజు తదితరులు ఉన్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ చేసిన ఎస్పీ రాధిక



కేసుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: పోలీసు అధికారులు, సిబ్బంది నేర నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం ఎస్పీ నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేషన్‌లో ఉన్న రిసెప్షన్ కేంద్రాన్ని పరిశీలించి.. నిర్వహణ, ఫిర్యాదులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి వాటి నిర్వహణపై సంతృప్తి చెందారు. ముఖ్యమైన కేసులపై ఎస్ఐలు బలివాడ గణేష్, ఎం.ప్రవల్లికలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేయాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తికాని కేసులపై ఆరా తీసి వేగవంతం చేయాలని సూచిస్తూ.. ప్రతీ కేసును సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలన్నారు. ఎప్పటికప్పుడు పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ముఖ్యంగా మహిళల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతిరోజూ మీ పరిధిలో గల వార్డు, గ్రామాల్లో సందర్శించి ప్రజలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. రాత్రి పూట గస్తీ పటిష్టంగా అమలు చేయాలన్నారు. డీఎస్పీ వై.శృతి, సీఐ లెంక సన్యాసినాయుడు, సీసీ శివకుమార్ ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు



జీటీ రోడ్డుపై ఏర్పాటు చేసినబోర్డును తొలగిస్తున్న అధికారులు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని జీటీ రోడ్డులో ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు పట్టణ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన చర్యలుచేపట్టారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్కర్, ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు అక్రమణలు తొలగించేందుకు రంగంలోనికి దిగారు. ఫుట్‌పాత్‌ను స్థానికంగా ఉన్న కొందరు వ్యాపారులు ఆక్రమించుకుని అద్దెలకు ఇవ్వడంతో వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో కొన్ని సందర్భాల్లో వీఐపీలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా సమయాల్లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. ఏడు రోడ్ల కూడలి నుంచి జీటీ రోడ్డులో షాపింగ్ మాల్స్ ముందు పెట్టిన హోర్డింగ్‌లు, కటౌట్లు, ఫుట్‌పాత్‌పై ఉన్న అక్రమణలు, చిన్నచిన్న దుకాణాలు పూర్తిస్థాయిలో తొలగించారు. కొన్ని చోట్ల షాపుల యజమానులు ఎదురు తిరిగి అక్రమణలు తొలగించకుండా అడ్డుకునేలా అధికారులతో వాదనలకు దిగారు. మున్సిపల్ కమిషనర్ చల ఓబులేసు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ టీపీఎస్ అప్పలరాజు, ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావుతో పాటు ప్రత్యేక సిబ్బంది, పోలీసులు ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు.

సీఎం జగన్ హయాంలో ప్రజాసంక్షేమ పాలన



మాట్లాడుతున్న చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సంక్షేమ పాలన నడుస్తోందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. చిలకపాలెంలో పల్లెపల్లెకు ఎంపీపీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందజేయటాన్ని సైతం ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని విమర్శించారు. చిలకపాలెం గ్రామంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ. 6.44 కోట్లు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మాడుగుల మురళీధర్ బాబా, సనపల నారాయణరావు, సర్పంచ్ డొంక అదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తడిటూరి రోజా రాణి పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం యువతకు ఆదర్శం



శ్రీకాకుళం అర్బన్: పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న భాస్కరరావు

శ్రీకాకుళం అర్బన్: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతరానికి ఆదర్శమని సీపీఎం సీనియర్ నాయకులు ఎస్.భాస్కరరావు అన్నారు. కామ్రేడ్ సుందరయ్య 38వ వర్ధంతి సభ శ్రీకాకుళంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ మోహనరావు అధ్యక్షతన జరిగింది. భాస్కరరావు మాట్లాడుతూ సుందరయ్య నిబద్ధత కలిగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పోరాటాల్ని నడిపారన్నారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు భవిరి కృష్ణ మూర్తి, కొత్తకోట అప్పారావు, ఎం.ప్రభాకర్, కె.సూరయ్య, జె.జ్యోతేశ్వరావు, పి.తేజేశ్వరరావు, కె.చంద్రశేఖరరావు, ఎస్.కిశోర్, ఎం.సత్యం తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్యాంక్రిగ్ ఫిస్టన్స్ పరిశ్రమ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అరిణాం అక్కివలస గ్రామంలో శుక్రవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, పరిశ్రమ యూనియన్ సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రణస్థలం: సోషలిజంతోనే సమసమాజం సాధ్యమౌతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి కె.గురునాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పైడిభీమవరం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 169లో 31 ఎకరాల 28 సెంట్ల ప్రభుత్వ భూమి (ఎల్‌సీ ల్యాండ్ నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి) కొంతమంది రైతుల అధీనంలో ఉండటంతో పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే ఈ భూమిలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాలను జిల్లా అధికారులు మంజూరు చేశారు.

రైతులతో శ్రీకాకుళం తహసీల్దార్ ఎస్.వెంకటరావు మాట్లాడి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: కారు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన రెడ్డి గణేశ్వరరావు (55) రోజు కూలీ పనుల నిమిత్తం విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఒకరి ఇంటిలో పనిచేస్తున్నా డు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రోడ్డుపక్కనున్న చెట్టు కింద నిద్రపోయాడు. ఆ సమయంలో ధర్మపురి నుంచి ప్రదీప్‌నగర్ వైపు వస్తున్న కారు అతడి పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన గణేశ్వరరావును డ్రైవర్ తన కారులోనే తీసుకెళ్లి మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై రామగణేష్ తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ అన్నా శామ్యేల్ లెంక శుక్రవారం తెలిపారు.

ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 22 నుంచి వచ్చేనెల ఏడో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యతిరాజులుకు ప్రత్యేక అవార్డు



జస్టిస్ యతిరాజులుకు అవార్డును అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త గురుగుబెల్లి యతిరాజులుకు డాక్టర్ నీలం సంజీవరెడ్డి న్యాయశిరోమణి-2023 అవార్డును అందజేశారు. డాక్టర్ నీలం సంజీవరెడ్డి 110వ జయంతి వేడుకల సందర్భంగా భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో మాజీ మంత్రి మండలి బుద్దప్రసాద్ ఈ అవార్డును అందజేశారు. చొప్పా గంగిరెడ్డి, డి.సుందరరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుది తప్పుడు ప్రచారం





మూగి గురుమూర్తి , మూగి శ్రీరాములు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం జిల్లా పెందుర్తి వద్ద జరిగిన సభలో మత్స్యరుల సంక్షేమంపై అబాద్ధాలు, తప్పడు ప్రచారం చేశారని జిల్లాకు చెందిన మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలను శుక్రవారం ఒక ప్రకటనలో మత్స్యకార సంఘం నాయకులు, ఎచ్చెర్ల మండల కన్వీనర్, మూగి శ్రీరాములు, న్యాయవాది మూగి గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. నాడు మత్స్యకారులు ఎస్టీ రిజర్వేషన్ కోసం ఉద్యమాలు చేస్తే.. చంద్రబాబు అవమానించారని గుర్తుచేశారు. అధికారంలో ఉండగా మత్స్యకాలను పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు సానుభూతి ఒలకబోస్తున్నారన్నారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు కేంద్రానికి సిఫార్సు చేశానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అటువంటి ప్రక్రియ చేసినట్టు ఇంతవరకు తమకు తెలియదని, ఎవ్వరికీ తెలియకుండా సిఫార్సులు ఎలా చేశారని ప్రశ్నించారు. మరోసారి మత్స్యకారులను మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంలో అబద్ధాలు చెబుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వేట నిషేధ సమయంలో భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచారని తెలిపారు. రాజ్యాధికారంలో మత్స్యకారులకు పెద్దపీట వేశారని, కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో 9 హార్బర్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

గడప గడపలో అభివృద్ధి



పతివాడపాలెంలో ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గడప గడపలో అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. పిషిని గ్రామ సచివాలయ పరిధిలోని పతివాడపాలెం, నెలివాడ గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయాఅని అడిగి తెలుసుకున్నారు. కాలువ నిర్మించాలని నెలివాడ ఎస్సీ కాలనీ వాసులు, పతివాడపాలెంలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, చిన రామినాయుడు, పిల్ల ఆనందరావు పాత్రుడు, గొర్లె అప్పలనర్సునాయుడు, కరిమజ్జి భాస్కరరావు, గొర్లె తిరుపతి నాయుడు, పిషిణి సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు పతివాడ నాగమణి, నెలివాడ సర్పంచ్ పతివాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21 మంది జూదరులపై కేసు నమోదు

- రూ.1,29,069 నగదు స్వాధీనం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలో రెండు వేర్వేరు చోట్ల జూదమాడుతున్న 21 మందిపై కేసులు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. కిమ్స్ సమీపంలో పదిమంది జూదరులు పట్టుబడటంతో వారి వద్ద నుంచి రూ.1,15,919 నగదు, పది మొబైళ్లు, ఐదు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. గొంటి వీధిలోని సాయిబుల కాలనీ వద్ద జూదం ఆడుతూ 11 మంది పట్టుబడగా.. వీరి వద్ద నుంచి రూ.13,150 నగదు, పది ఫోన్లు, మూడు ద్విచ్రవాహనాలను సీజ్ చేశామన్నారు. పోలీస్ సిబ్బందితో పాటు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇంటిలిజెన్స్ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదగనగళ్లవానిపేట సముద్ర తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం కనిపించింది. ఈ వ్యక్తికి 25-30 ఏళ్ల వయసు ఉంటుందని, సముద్రంలో మునిగి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.